ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

మంగళవారం 26 మార్చి 2024





మొత్తం ఓటర్లు 17, 69, 225

పురుషులు 9,13,772

మహిళలు 8,55,262

ఇతరులు 191

గుంటూరు విశిష్టత...

మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమతులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. స్వాతంత్ర్య సమర యోధులు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి వారు జన్మించింది ఇక్కడే. భారత స్వాతంత్రోద్యమ సమయంలో 1889లో మహాత్మా గాంధీ వీరితో కలిసి ఇక్కడ ఒక సదస్సు నిర్వహించారు. దేశంలోనే పేరొందిన ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల 1885లో స్థాపించబడింది. భారతదేశంలోనే మొట్టమొదటగా పొగాకు పరిశోధన సంస్థ 1936లో ఇక్కడ ఏర్పాటైంది. ఉమ్మడి రాష్ట్రంలోనే పేరొందిన ప్రభుత్వ వైద్యశాల 1848లో స్థాపించబడింది. ఉండవల్లి గుహలు, మంగళగిరిలోని పానకాలస్వామి ఆలయం, పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయాలు ఈ ప్రాంతంలో పేరొందాయి. 150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పురాతన మున్సిపాలిటీగా గుంటూరు పేరొందింది. 1866లో 25వేల జనాభాతో ఏర్పాటై 1891లో థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా 1917లో ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిగా, 1952లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 1960లో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయపడింది. 1994లో మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. మొట్టమొదటగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 1995లో నిర్వహించగా మొదటి మేయర్‌గా టీడీపీ తరఫున డాక్టర్ కొల్లి శారద గెలుపొంది మంచి పేరు తెచ్చుకున్నారు.

ఇక్కడి నుంచి లోక్‌సభకు..

1952లో ఏర్పడిన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి మొదటిసారి ఎస్‌వీఎల్ నరసింహం ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. ఆయన తర్వాత కొత్త రఘురామయ్య ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి వరుస విజయాలు సాధించారు. 1957 నుంచి 1977 వరకు వరుసగా జరిగిన ఐదు ఎన్నికల్లోనూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అంతకుమునుపు 1952లో తెనాలి లోక్‌సభ స్థానం నుంచి కూడా ఆయన గెలుపొందారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో రక్షణ, కార్మిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి మంత్రివర్గంలో పౌరసరఫరాలు, సాంకేతికశాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రధాని ఇందిరాగాంధీ మంత్రివర్గంలో న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌక, రవాణా, పర్యాటక శాఖలను నిర్వహించారు.

సంవత్సరం -	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	ఎన్‌జీ రంగా	కేఎల్‌పీ	17517
1957	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	58955
1962	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	99942
1967	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్‌వీఎల్ రావు	ఇండిపెండెంట్	117032
1971	కె రఘురామయ్య	కాంగ్రెస్	జూపూడి యజ్ఞనారాయణ	బీజేఎస్	191018
1977	కె రఘురామయ్య	కాంగ్రెస్	కె సదాశివరావు	బీఎల్‌డీ	85529
1980	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	కె సదాశివరావు	జనతా ఎస్	157334
1984	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	మొవ్వ చంద్రశేఖరరావు	టీడీపీ	11894
1989	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు	టీడీపీ	65013
1991	లాల్‌జాన్‌బాషా	టీడీపీ	ఎన్‌జీ రంగా	కాంగ్రెస్	14744
1996	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	57,347
1998	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	48,499
1999	యంపరాల వెంకటేశ్వరరావు	టీడీపీ	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	40330
2004	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	వైవీ రావు	టీడీపీ	129792
2009	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	మాదల రాజేంద్ర	టీడీపీ	39355
2014	గల్లా జయదేవ్	టీడీపీ	వల్లభనేని బాలశౌరి	వైసీపీ	69111
2019	గల్లా జయదేవ్	టీడీపీ	మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి	వైసీపీ	4205

గుంటూరు అనగానే మొట్టమొదట గుర్తుకు వచ్చేది మిర్చి.. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అందుకే గుంటూరు ఘాటు అనే నానుడి ప్రజల్లో ఉంది. రాజకీయాల్లోనూ అదే తీరు ఇక్కడ కనపడుతుంది. ఎందరో ఉద్ధండులైన రాజ కీయ నేతలను అందించిన ఘనకీర్తి గుంటూ రుది. స్వాతంత్ర్య పోరాటం నుంచి, ఆ తర్వాత ఇక్కడ మహా మహులు నడయాడారు. నీతివం తమైన రాజకీయాన్ని పాటించిన ఆచార్య ఎన్జీ రంగా ఇక్కడి వారే. కేంద్ర మంత్రిగా అనేక శాఖలను నిర్వహించిన కొత్త రఘురా మయ్య ఆదర్శవంతమైన రాజకీయ నేతగా గుర్తింపు పొందారు. అంతే కాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమ తులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది.

గుంటూరు.. ఘనకీర్తి

- రాజకీయాల్లో ఉద్ధండులను అందించిన గుంటూరు జిల్లా
- దేశానికి ఉత్తమ పార్లమెంటేరియన్‌ను అందించిన ఘనత ఈ నియోజకవర్గానిదే...
- సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కిన ఆచార్య ఎన్జీ రంగా
- కేంద్ర మంత్రిగా అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన కొత్త రఘురామయ్య
- ఆసియాలోనే అతి పెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులో..



రఘురామయ్య



ఎన్‌జీ రంగా



ఎస్‌వీఎల్ నరసింహం



లాల్‌జాన్‌బాషా



రాయపాటి

గుంటూరు, మార్చి25(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానం అనగానే మొట్టమొదటగా గుర్తుకొచ్చేది ఆచార్య ఎన్జీ రంగానే అని చెప్పవచ్చు. లోక్‌సభ, రాజ్యసభలోనూ 60 ఏళ్ళ పాటు కొనసాగి రైతుల పక్షాన పోరాడిన ఆచార్య రంగాజీని దేశానికి అందించిన ఘనత గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానిదే సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఆయన ఎక్కటం ద్వారా ఈ ఘనత వహించారు. ఆరు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ ఎలాంటి పదవులు చేపట్టకుండా ప్రతిష్టాత్మక, నీతివంతమైన రాజకీయాన్ని పాటించిన ఖ్యాతి ఆచార్య రంగాదే. రైతులకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టింది. 1996లో ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనిర్సిటీగా రూపాంతరం చెందిన ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలోనే వ్యవసాయ విద్యలో అగ్రగామిగా నిలిచింది.

ఆచార్య ఎన్జీ రంగా..


1980, 84, 89లో జరిగిన ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆచార్య ఎన్జీ రంగా గెలుపొందారు. 1930 నుంచి 1991వరకు కొద్దికాలం తప్పితే నిరాఘాటంగా పార్లమెంట్‌లో 60 ఏళ్లు ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. 1952, 1965లలో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంట్ సభలకు, 1980లో ఐక్యరాజ్య సమితి సమావేశానికి భారత ప్రతినిధిగా హాజరయ్యారు. కురువృద్ధుడు, సీనియర్ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్‌జీ రంగాను ఓడించి చట్టసభలో అడుగు పెట్టే అవకాశం బాషాకు నందమూరి తారక రామారావు కల్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం అనంతరం తొట్టతొలుతగా ఈ నియోజకవర్గం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఎస్ఎం లాల్ జాన్‌బాషాకు లభించింది. 1991లో ఆయన విజయం సాధించారు. రంగా ఎంతోమందిని ప్రజానాయకులుగా తీర్చిదిద్దారు. గౌతు లచ్చన్న, పాతూరి రాజగోపాలనాయుడు, జి.మునిరత్నం నాయుడు, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, యడ్లపాటి వెంకటరావు, కందుల ఓబులురెడ్డి, ప్రగడ కోటయ్య, నుంకర సత్యన్నారాయణ, గోగినేని నాగేశ్వరరావు తదితరులు రంగా శిష్యరికం నుంచి వచ్చిన వారే.

ఆ తరువాత..

తరువాత తరంలో సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా పేరొందిన రాయపాటి సాంబశివరావు 1996, 98,లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడ గెలుపొందారు. 1999లో టీడీపీ తరఫున ఈ నియోజకవర్గం నుంచి గెలిచే అవకాశం యంపరాల వెంకటేశ్వరరావు (వైవీ రావు)కు దక్కింది. ఆ తర్వాత మళ్లీ రెండు పర్యాయాలు 2004, 2009లో రాయపాటి గెలిచారు. 2014, 2019లో ఈ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్‌కు దక్కింది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తున్న జయదేవ్ తిరిగి పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతో రాజకీయాల నుంచి వైదొలిగారు.



వైవీరావు



జయదేవ్

డాక్టర్ పెమ్మసాని వర్సెస్ రోశయ్య..

రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బరిలోకి దిగారు. వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నప్పటికీ డాక్టర్ పెమ్మసాని పుట్టింది, చదివింది, పెరిగింది ఈ లోక్‌సభ స్థానం పరిధిలోనే. గుంటూరులోనే ఆయన విద్యనభ్యసించారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఎంతో కాలంగా ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్నారు. తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసినప్పటికీ తన వాక్చాతుర్యంతో ఇప్పటికే ఆయన జనాదరణ పొందారు. ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ తరఫున పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బరిలోకి దిగారు. తొలుత వైసీపీ తరఫున రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణ బరిలోకి దిగి డాక్టర్ పెమ్మసాని స్పీడును చూసి తట్టుకోలేక రంగంలో నుంచి తప్పుకోవటంతో రోశయ్యను దించారు.





శాసనసభ నియోజకవర్గాలు

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో గుంటూ రు తూర్పు, గుంటూరు పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళ గిరి, తాడికొండ (ఎస్సీ), ప్రత్తిపాడు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

నియోజకవర్గ ముఖచిత్రం

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- కమ్మ 2,02,769
- రెడ్డి 1,05,866
- ముస్లిం 1,87,080
- కాపు 2,07,552
- మాదిగ 1,58,242
- మాల 2,03,917
- ఆర్యవైశ్య 81,375
- యాదవ 1,05,117
- వడ్డెర 30,485
- గౌడ 40,252
- రజక 43,340
- ముదిరాజు 4,024
- ఎరుకుల 16,852
- నాయిబ్రాహ్మణ 4,787
- యానాది 9,082
- బ్రాహ్మణ 35, 854
- వెలమలు 1,000
- క్షత్రియ 3,000
- క్రిస్టియన్లు 6,149
- దూదేకుల 3,472
- పద్మశాలి 56,672
- మంగళి 15,398
- కుమ్మరి 16,769
- ఉప్పర 14,458
- బోయలు 1453
- సూర్యబలిజ 2,414
- కృష్ణ బలిజ 2,457
- పెరిక 1,343
- మేదర 2,701
- జంగం 500
- లంబాడి 3,598
- చెంచు 141
- బుడబుక్కలు 500
- ఇతరులు 32, 121

పునర్విభజనలో అనేక మార్పులు..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం 2007లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన మూలంగా అనేక మార్పులకు గురైంది. అంతకుమునుపు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు శాసనసభ నియోజకవర్గాలు నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలోకి వెళ్ళిపోయాయి. గతంలో ఉన్న తెనాలి లోక్‌సభ నియోజకవర్గం రద్దయి దాని పరిధిలో ఉన్న తెనాలి, మంగళగిరి శాసనసభ నియోజకవర్గాలు గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చాయి. 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో గుంటూరు లోక్‌సభ స్థానం ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. గుంటూరు జిల్లాగా కొనసాగుతున్న ఈ లోక్‌సభ స్థానంలో 18 మండలాలు ఉన్నాయి.

కోడ్ కాదని.. ఓట్ల వేట

- యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న వైసీపీ
- వలంటీర్లకు తాయిలాలు ఇచ్చి మరీ ప్రచారం
- సెల్‌ఫోన్లకు సీఎం జగన్ వాయిస్‌తో సందేశాలు
- ఏ పార్టీకి ఓటు వేస్తారంటూ సర్వే ముసుగులో ఆరాపై అనుమానాలు
- ప్రతిపక్షాలకే ఎన్నికల నిబంధనలు అన్నట్లుగా అధికారుల తీరు



గుంటూరు, మార్చి 25: ఎన్నికల కోడ్ వచ్చి వారం అవుతుంది.. అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నా.. అధికారులు మారలేదు. ఎన్నికల నిబంధనలు ప్రతిపక్షాలకే అన్నట్లుగా అధికార యంత్రాంగం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. వలంటీర్లతో ప్రచారాలు, సీఎం జగన్ ఫొటోల తొలగించకపోవడం, సీఎం వాయిస్‌తో ప్రజల సెల్‌ఫోన్లకు సందేశాలు.. ఇలా కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు వలంటీర్లతో ప్రచార కార్యక్రమాలు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలు షరామామూలుగానే నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి కార్యాలయంలో వలంటీర్లతో మూడు రోజులుగా సమావేశాలు నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదు. పైగా వలంటీర్లతో గ్రామాల్లో కులాల వారీగా వివరాలు సేకరించాలని వలంటీర్లను ఆ అభ్యర్థి ప్రలోభాలకు గురి చేస్తున్నారని టీడీపీ నేతలు రుజువు చేసినా అధికారులు కనీసం పరిశీలన కూడా చేయలేదు. ఈ క్రమంలో తమపై దాడి చేశారని ఏకంగా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతోపాటు కూటమి పార్టీల నాయకులు స్వయంగా ఎస్పీకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసి, వలంటీర్‌లు ఉన్న ఫొటోలు, వీడియోలు అందించారు. సత్తెనపల్లిలో జగన్ స్టిక్కర్ ఉన్న చీరలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం విధితమే. కోడ్‌కు విరుద్ధంగా శుక్రవారం గుంటూరు మిర్చి యార్డులో గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి కిలారు రోశయ్య, గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా, ప్రత్తిపాడు అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు ఎన్నికల ప్రచారం చేశారు. మిర్చియార్డులో వైసీపీ అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు కట్టినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు అడ్డు కోవడంలేదు. మరోవైపు వారం రోజులుగా సీఎం జగన్ వాయిస్‌తో 'మీ బిడ్డ ఎవరితోనూ పొత్తుపెట్టుకోడు.. నమ్ముకున్నది దేవుడిని, మంచి చేసిన ప్రజలని.. కుట్రలు, కుతంత్రాలతో జెండాలు జత కట్టడమే వారి అజెండా.. మీ ఇంటిలో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా ఉండండి..' అంటూ 29 సెకండ్ల నిడివితో 8038462583 నెంబర్‌తో వాయిస్ సందేశాలు ఓటర్లకు పంపుతున్నారు. 6302994851 నెంబర్‌తో నరసరావుపేట ఓటర్ల నుంచి ఎవరికి ఓటు వేస్తారు అంటూ ప్రశ్నలతో సర్వే చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా చెబితే ఎక్కడ ఓట్లు తొలగిస్తారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇటువంటి సర్వేలు నిబంధనలకు విరుద్ధం అయినా యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక వలంటీర్లు యథేచ్ఛగా వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఏమాత్రం లెక్క చేయడంలేదు. పైగా మరింత విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ అధికారులు ఇటువంటి కోడ్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు కోరుతున్నారు.

దారిద్ర్యం

- ఆ రహదారిపై ప్రయాణం నరకయాతన
- కొండమోడు రహదారిపై భారీగా గోతులు
- టెండర్ ప్రక్రియ దాటని జాతీయ రహదారి నిర్మాణం
- ఐదేళ్లుగా సాగదీత.. విస్తరణ పనులు ఎప్పటికో ?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేరుకే జాతీయ రహదారి.. వాస్తవానికి అది డొంక రోడ్డు కన్నా అధ్వానం. గోతుల మయంగా మారింది. పేరేచర్ల- కొండమోడు 167ఏజీ రహదారిపై వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు రహదారి గోతుల మయమైంది. అడుగుకో గోతితో వాహనదారులను ఎదుర్కొంటున్న ఇక్కట్లు చెప్పనలవి కావు. ఐదేళ్లుగా రహదారి విస్తరణ టెండర్ ప్రక్రియ దాటలేదు. రహదారి నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. నిర్మాణం ఇప్పట్లో ప్రారంభించే పరిస్థితులు లేవు.

పేరేచర్ల- కొండమోడు మధ్య రహదారిని విస్తరించాలని దశాబ్దాలుగా వాహనదారులు కోరుతున్నారు. దీనిని జాతీయ రహదారిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. పనులు ఇంకా టెండర్ల ప్రక్రియలోనే నిలిచిపోయాయి. జాతీయ రహదారిగా గుర్తించినందున నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని చెబుతూ గోతులు కూడా పూడ్చడం లేదు. రోడ్డు ఇరుకుగా ఉండటం, బెర్మ్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త రహదారి నిర్మాణం మొదలయ్యే వరకు కనీసం గోతులు పూడ్చి రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు వేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. పేరే చర్ల- కొండమోడు మధ్య రహదారి ఇరుకుగా ఉండటం, గోతుల మయం కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు 27 కిలోమీటర్ల మేర మార్గం అత్యంత అధ్వానంగా ఉంది. ఈ మార్గం వాహనదారులకు పరీక్ష పెడుతోంది. ఎదురుగా వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్లాల్సివస్తోంది. రోడ్డు పక్క మార్జిన్లు నిర్వహణ లేక గోతులతో ఉండటంతో కిందికి దిగి వాహనాలను దాటి వెళ్ల లేని పరిస్థితి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు రోడ్డు ఇరుకుగా ఉండటం, ముందు వెళుతున్న వాహనాలను అధిగమించే పరిస్థితులు లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గోతులు పూడ్చాలని, కనీస మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు. పనులు చేపట్టడం మాట ఎలా ఉన్నా కనీసం మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

రహదారి విస్తరణకు రూ.1032.52 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగు వరుసలుగా విస్తరించడానికి 464 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తికాలేదు. తొలిదశలో పనులకు సంబంధించి రూ.699 కోట్ల వ్యయంతో టెండర్లు నిర్వహించారు. ఈ మార్గం నాలుగు వరుసలుగా విస్తరించడంతోపాటు మేడికొండూరు, సత్తెనపల్లి, రాజుపాలెం మండలంలో మూడుచోట్ల బైపాస్‌లు నిర్మించాలి. ఆయా పనులు ఎప్పటికి ప్రారంభిస్తారో వేచి చూడాలి.



కొండమోడు రహదారిపై గోతులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(మంగళవారం)

సహారీ (ఉదయం) 4.51 (బుధవారం)

జాబ్ కార్నర్

బెల్‌లో సీనియర్ ఇంజనీర్లు

బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బెల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 33**

1. సీనియర్ ఇంజనీర్: **19 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్: **10 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **4 పోస్టులు**

అర్హత: ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో బీఈ/బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://edn.bhel.com/

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ - ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 ద్వారా అడ్మిషన్ పొందవచ్చు.

హైదరాబాద్ ఐఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ

విభాగాలు: ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(సీఎస్ఐఎస్), కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ (సీఏఎస్ఈ) ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్(పీడీఎం), ఎంఎస్ బై రీసెర్చ్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఈ), బయోటెక్నాలజీ), పీహెచ్‌డీ(కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్(సీఎల్), కంప్యుటేషనల్ నేచురల్ సైన్సెస్ (సీఎన్ఎస్), స్పేషియల్ ఇన్ఫర్మేటిక్స్ (ఎస్ఐ), కాగ్నిటివ్ సైన్స్(సీఎస్), హ్యూమన్ సైన్సెస్ (హెచ్ఎస్).

దరఖాస్తు రుసుము: రూ.2,500

చివరి తేదీ: ఏప్రిల్ 1 **ప్రవేశ పరీక్ష:** మే 4

ఇంటర్వ్యూలు: ఎంఎస్ జూన్ 5, 6; పీహెచ్‌డీ జూన్ 7, 8

వెబ్‌సైట్: pgadmissions.iiit.ac.in/pgee/

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(సోమవారం దిక్సూచి తరువాయి)

పిటీషనర్ల ముఖ్య వాదనలు

1. ముస్లిం శరణార్థులను అనుమతించకపోవడం, మత వివక్ష ప్రాతిపదికపై పౌరసత్వం ఇవ్వడం వంటి అంశాల ద్వారా ఈ పౌరసత్వ సవరణ చట్టం దేశ రాజ్యాంగ మౌలిక లక్షణాలైన సమానత్వం, లౌకికతత్వం వంటి ప్రాథమిక హక్కుల అంశాలను ఉల్లంఘిస్తోంది. అందువల్ల ఈ చట్ట సవరణ రాజ్యాంగ వ్యతిరేకం.

2. కేవలం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులను మాత్రమే అనుమతించడం, ఇతర సరిహద్దు దేశాలైన మయన్మార్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలకు ఈ చట్టాన్ని వర్తించకపోవడం వంటి ప్రాంతీయ వివక్ష కూడా ఈ చట్ట సవరణ ద్వారా ఏర్పడింది.

3. అతి సున్నిత, సాంస్కృతికపరంగా వైవిధ్యమైన తెగలు గల ఈశాన్య రాష్ట్రాలు సరిహద్దు ప్రాంతాల నుంచి ఇప్పటికీ అక్రమ వలస సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ద్వారా ఈ ప్రాంత తెగల సంస్కృతికి ముప్పు ఏర్పడుతుంది. ఈ ప్రాంతంలో కొరతగా ఉన్న వనరులపైన ఒత్తిడి అధికమౌతుంది. అక్కడి ఆదివాసీల ప్రత్యేక హక్కులకు భంగం కలుగుతుంది. ప్రస్తుతం ఈ చట్టం 2024 మార్చి 12 నుంచి అమలులోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం భారత సరిహద్దున గల మూడు ముస్లిం దేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన ఆరు ముస్లిమేతర మతాల (హిందూ, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ) శరణార్థులకు(ఎవరైతే ఆ దేశాల్లో మత హింసకు గురై తమ దేశాన్ని వీడి భారత్‌కు శరణార్థులుగా వచ్చారో వారికి) ఎటువంటి వీసా, పాస్‌పోర్ట్ వంటి ధృవీకరణ పత్రాలు లేనప్పటికీ, కొన్ని గుర్తింపు పత్రాలు సమర్పించడం ద్వారా భారత పౌరసత్వం కల్పించనున్నారు.


ఈ విధంగా పౌరసత్వం పొందడానికి ఆ శరణార్థులు 2014 డిసెంబరు 14లోగా భారత్‌కు వచ్చి ఉండాలి. వారు కనీసం అయిదు సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువకాలంగా భారత్ నివసిస్తున్నట్లు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. వారు భారత రాజ్యాంగం గుర్తించిన షెడ్యూల్ 8లో గల భాషల్లో ఏదైనా ఒకటి మాట్లాడగలమని స్వయం ధృవీకరణ సమర్పించాలి. అంతేకాక తాము పౌరసత్వ చట్టం అనుమతిస్తున్న మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశానికి చెందినవారిమని ధృవీకరించే ఆధారాలు అంటే ఆ దేశాలు జారీచేసిన జనన ధృవీకరణ, విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్లు, ఐడెంటిటీ కార్డులు, వీసా లేదా పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి, భూమిహక్కు లేదా కౌలుదారీ పత్రాలు వంటివి ఏవైనా అక్కడి ప్రభుత్వాలు జారీచేసిన పత్రాలను ఆధారంగా చూపవచ్చు. ఇవి తమ తల్లిదండ్రులు, తాతలకు, ముత్తాతలకు సంబంధించినవి ఏవైనా సరే ఆధారాలుగా చూపవచ్చు. వీటిద్వారా ఆ శరణార్థులు ఏ దేశానికి చెందినవారు, ఏ మతానికి చెందిన వారు అనే అంశాలను ధృవీకరించవచ్చు.

అదే విధంగా ఆ శరణార్థులు భారతదేశానికి 2014 డిసెంబరు 14లోగా రావడం జరిగిందని నిరూపించడానికి ఈ చట్ట నిబంధనల ప్రకారం 20 రకాల డాక్యుమెంట్స్‌ను అనుమతించారు. అవి:

- ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్ఓ) ద్వారా పొందిన స్లిప్
- జనాభా లెక్కల అధికారులు అందించిన రశీదు
- ఆధార్‌కార్డు
- వ్యాలిడ్ వీసా
- డ్రైవింగ్ లైసెన్స్
- రేషన్‌కార్డు
- గవర్నమెంట్ లేదా కోర్టుల ద్వారా జారీ అయిన ఏదైనా పత్రాలు
- బ్యాంక్ పాస్‌బుక్
- పాన్‌కార్డు
- వివాహ లేదా జనన ధృవీకరణ పత్రాలు
- యుటిలిటీ బిల్లులు
- స్కూల్ సర్టిఫికెటు
- ఏదైనా స్థానికసంస్థకు ఎన్నికైన పదవిలోని వ్యక్తి లేదా రెవెన్యూ ఆఫీసర్ జారీ చేసిన ధృవపత్రాలు వంటి దాదాపు 20 రకాల పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తారు.

సులభ నిబంధనలు

ఈ మినహాయింపులను సులభతరం చేయడానికి పౌరసత్వ సవరణ చట్టంలోని అనేక అంశాలను చాలావరకూ కుదించారు. ఉదాహరణకు భార



తదేశ పౌరసత్వాన్ని విదేశీయులు నేచురలైజేషన్ విధానం ద్వారా పొందాలనుకున్నప్పుడు వారు కనీసం 14 సంవత్సరాలపాటు దేశంలో నివసిస్తున్నవారై ఉండాలనే నిబంధనను ఈ చట్ట సవరణ ద్వారా అయిదు సంవత్సరాలకు కుదించారు.

అదేవిధంగా భారతీయ భాషల్లో వారికి ఒక్కటైనా వచ్చని నిర్ధారించే విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్ స్థానంలో స్వయం ధృవీకరణ సమర్పిస్తే సరిపోతుంది.

ఎటువంటి వాలిడ్ వీసా, లాంగ్‌టర్మ్ వీసాలు లేనప్పటికీ వాటి గడువు దాటిపోయినా వీరికి ఎటువంటి అడ్డంకులూ ఉండవు. కేవలం తమ జాతీయత, మతం, భారతదేశంలోకి నిర్ధారిత కటాఫ్ సమయం కంటే ముందే వచ్చామని నిరూపించుకుంటే సరిపోతుంది. అలాగే ఈశాన్య రాష్ట్రాల ప్రాంతాల్లోకి ప్రవేశించడానికి, సంచరించడానికి అవసరమైన లైన్ పర్మిట్ విధానం ఈ శరణార్థుకు వర్తించదు.

ఈవిధంగా అనేక మినహాయింపులు పొందడం ద్వారా అనేకమంది శరణార్థులు భద్రమైన జీవనం గడపడానికి ఏళ్లతరబడి చూస్తున్న ఎదురుచూపులకు తెరపడనుంది. ఈ పౌరసత్వ దరఖాస్తుదారులు స్థానిక అధికారుల, నాయకుల వ్యతిరేకతకు దోపిడీకి గురవకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే తమ దరఖాస్తులు సమర్పించే వెసులుబాటు తీసుకువచ్చారు. ఈ దరఖాస్తులను పరిశీలించడానికి కేంద్రప్రభుత్వం జిల్లాస్థాయిలో సాధికార డిస్ట్రిక్ లెవల్ కమిటీ(డీఎల్‌సీ)లను ఏర్పాటుచేసింది.

దరఖాస్తులను ఈ కమిటీ ప్రాసెస్ చేయగా, పౌరసత్వం అందించే అధికారం ఒక ఎంపవర్డ్ కమిటీకి ఉంటుంది. ఈ కమిటీలో సెన్సెస్ డిపార్ట్‌మెంట్, హోంమంత్రిత్వశాఖ, పోస్ట్‌మాస్టర్ జనరల్, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లకు చెందిన స్టేట్ ఇన్ఫర్మాటిక్స్ ఆఫీసర్స్ వంటి శాఖలకు సంబంధించిన ప్రతినిధులను ఉంటారు. రైల్వేస్ నుంచి రాష్ట్ర హోంశాఖల నుంచి ప్రత్యేక ఆహ్వానితులు ఈ కమిటీ ఉంటారు. ఈ కమిటీకి సెన్సస్ విభాగానికి చెందిన అధికారి డైరెక్టర్‌గా ఉంటారు.

అదేవిధంగా డీఎల్‌సీల్లో ఆ జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లేదా వారి ప్రతినిధి, కేంద్రప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులు ఉంటారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా తహసిల్దార్ హోదాకు తగ్గని వ్యక్తి, రైల్వేశాఖ ప్రతినిధిగా జ్యురిస్‌డిక్షనల్ స్టేషన్ మాస్టర్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

ఈవిధంగా డీఎల్‌సీల ద్వారా దరఖాస్తులు పరిశీలించి, ఎంపవర్డ్ కమిటీ ద్వారా పౌరసత్వం జారీ చేస్తుంది. అయితే కొన్ని మతాల వారిని మాత్రమే శరణార్థులుగా గుర్తించి, అదీ కొన్ని దేశాలకు చెందినవారికి మాత్రమే పౌరసత్వం ఇచ్చి ఆదుకొనే ప్రయత్నం చేయడం విపక్షాపూరితంగా ఉందన్నది ప్రధాన విమర్శ. ఆ కారణంతోనే కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలుచేయబోమని పేర్కొంటున్నాయి. ఈ రాష్ట్రాలకు తోడు ముస్లిం మతసంస్థలు, ఇతరత్రా సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా చర్చను లేవదీశాయి.

ప్రభుత్వ వాదన

అయితే ప్రభుత్వం మాత్రం తాము కొత్తగా వివక్ష చూపడం అంటూ ఏమీ లేదని అంటోంది. గతంలో 2004 నుంచి అమలులో ఉన్న ప్రభుత్వ ఆదేశాలకు ఒక నిర్దిష్ట చట్టరూపం తెచ్చామని వాదిస్తోంది. అదీకాక చుట్టుపక్కల మూడు ముస్లిం దేశాల్లో మతహింసకు గురవుతున్న అక్కడి మైనారిటీ వర్గాల శరణార్థులకు ఆశ్రయం కల్పించడం మత ప్రాతిపదికన వివక్ష చూపడం కాదని, ఆ దేశాల్లో మెజారిటీలుగా ఉన్న ముస్లింలకు మన దేశ పౌరసత్వం కల్పించాల్సిన అవసరం లేదన్నది కేంద్రప్రభుత్వ వాదన. అదేవిధంగా ఇతర దేశాలు, మతాలకు చెందిన శరణార్థులకు వారు అక్కడ మెజారిటీ మతాలకు చెందిన వారైనప్పటికీ శరణార్థులుగా వచ్చిన సందర్భాల్లో లాంగ్‌టర్మ్ వీసా(ఎల్‌టీవీ)లు కల్పించి వారిని సైతం ఆదుకోవడం జరుగుతోందని తెలిపింది. పరిస్థితులు చక్కబడిన వెంటనే ఆ మెజారిటీ వర్గాల వారు తిరిగి వెళ్లిపోవడానికి ఆసక్తి చూపుతారని, అందువల్ల వారికి శాశ్వత భారత పౌరసత్వం కల్పించనవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.

అంతేకాకుండా ఉప తెగల మధ్య పోరు కారణంగా ముస్లిం దేశాల నుంచి కొందరు ముస్లింలు శరణార్థులుగా వస్తుంటారని పేర్కొంది. అంతర్గతంగా జరిగే కుమ్ములాటల తో దేశం విడిచివచ్చే వారికి ఈ చట్టాన్ని వర్తింపచేయలేమని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇస్తోంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vE7iQ7bలో చదవండి.

అద్భుత కలయిక... ఇంకోసారి!



రామ్‌చరణ్ కెరీర్‌లో కలకాలం గుర్తుండిపోయే చిత్రం 'రంగస్థలం'. అంతవరకూ కమర్షియల్ క్యారెక్టర్స్ చేస్తూ అల్ట్రామోడరన్ హీరోగా గుర్తింపు పొందిన రామ్‌చరణ్‌తో పక్కా పల్లెటూరి యువకుడు చిట్టిబాబు పాత్ర చేయించి, సాహసం చేశారు దర్శకుడు సుకుమార్. అభిమానులు ఉప్పొంగే విధంగా, ప్రేక్షకులు మెచ్చుకొనే రీతిలో ఆ చిత్రంలో నటించి 'రంగస్థలం' అద్భుత విజయానికి కారణమయ్యారు రామ్‌చరణ్. ఇక అప్పటినుంచి వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్న ప్రేక్షక అభిమానులకు సోమవారం ఓ గుడ్ న్యూస్ చెప్పారు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్. సుకుమార్ రైటింగ్స్ సంస్థతో కలసి రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తీయనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభించి, 2025 చివరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తారని తెలిపారు. ఈసారి కూడా రామ్‌చరణ్ కోసం అత్యద్భుతమైన స్క్రిప్ట్‌ను సుకుమార్ తయారు చేశారని నిర్మాతలు చెప్పారు.

హోలీ అంటే భయపడేవాణ్ణి



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'మధురం కదా' విడుదలైంది. సోమవారం హోలీ వేడుకల్లో గ్రాండ్‌గా జరిగిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్‌రాజు పాల్గొన్నారు. మూవీ టీమ్‌తో హోలీ ఆడుతూ కలసి డాన్సులు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'తన కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఈ కథ మొదట విజయ్ విన్నాడు. నాకు ఫోన్ చేసి పరశురామ్ మంచి కథ చెప్పాడు. మీరు వింటారా? అని అడిగారు. నేను ఆ కథ విని 15 నిముషాల్లో ఓకే చెప్పేశాను. ఎందుకంటే ఇది మిడిల్ క్లాస్ కథ. మిమ్మల్ని మీరు చూసుకుంటున్నట్లుగా సినిమా ఉంటుంది. ఏప్రిల్ 5న ఫ్యామిలీస్ సినిమా చూడడానికి రండి' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'చదువుకొనే రోజుల్లో హోలీ అంటే రంగులు పూస్తారని, అవి అలాగే ఉంటాయనీ భయపడేవాణ్ణి. అదే టైమ్‌లో ఎగ్జామ్స్ జరుగుతుంటే చాలా మంది ముఖాల నిండా రంగులతో వచ్చే వారు. కానీ ఇప్పుడు ఇక్కడ మీ అందరితో కలసి హోలి సెలబ్రేట్ చేసుకుంటుంటే పండగంటే ఇలాగే ఉండాలనిపిస్తోంది. మనలాంటి ఫ్యామిలీస్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి కథ మా సినిమా. మీరు బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు. 'ఎప్పుడూ హోలీ పండుగను ముంబైలో చేసుకుంటూ ఉంటాను. ఈసారి మీ మధ్య 'ఫ్యామిలీ స్టార్' టీమ్‌తో కలసి సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా ఉంది' అని మృణాల్ ఠాకూర్ అన్నారు.

ఇండియన్ 3 కూడా ఉంటుంది



భారతీయ సినీ రంగంలో విశిష్ట నటుల్లో కమల్ హాసన్ ఒకరు. లోకనాయకుడిగా, వెర్సటైల్ జీనియస్‌గా అభిమానుల నుంచి కితాబులందుకునే కమల్, తన మల్టీ టాలెంట్‌తో సినీ ప్రియుల్ని ఎప్పటికప్పుడు అలరిస్తుంటారు. తాజాగా శ్రుతీ హాసన్, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ నటించిన 'ఇనిమెల్' సాంగ్‌కు లిరిక్స్ అందించారు. ఇటీవలే, ఓ మీడియా ఇంటర్వ్యూలో తను నటిస్తున్న సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

నేను ఎన్ని పనులు చేసినా నా ఫస్ట్ లవ్ సినిమానే. 'విక్రమ్' రిలీజ్ అయ్యి రెండేళ్లు దాటినా, ఇంతవరకూ నా నుంచి మరో సినిమా రాలేదని అభిమానులు ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంచెం ఆలస్యమైనా, నా ప్రాజెక్టులు ఒక్కొక్కటి థియేటర్లలో పలకరించడానికి సిద్ధమవుతున్నాయి. నేను టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఇండియన్-2 (భారతీయుడు-2) షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇండియన్-3 పనులు మొదలవుతాయి. ఈ చిత్రంలో నేను పోషించే సేనాపతి (సినిమాలో కమల్ పాత్ర)లుక్‌కు మేకప్ వేయడానికి నాలుగ్గంటలు, తీయడానికి మరో రెండుగంటలు పట్టేది. పార్ట్-2లో మొదటి భాగంలోలాగే రెండు పాత్రల్లో కనిపిస్తాను. మే 9న రిలీజ్ అయ్యే 'కల్కి 2898 ఏ.డీ'లో ఓ అతిథి పాత్రలో నటించాను. అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయులు గర్వించే విధంగా ఉంటుంది. ఎలక్షన్లు ముగిశాక మణిరత్నం దర్శకత్వంలో నటిస్తున్న 'థగ్ లైఫ్' షూటింగ్‌లో పాల్గొంటాను. అలాగే ధనుశ్ నటిస్తున్న ఇళయరాజా బయోపిక్‌కు స్క్రీన్‌ప్లే అందిస్తున్నాను. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించే ఈ సినిమాలో నేను నా నిజ జీవిత పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పారు.

ముచ్చటగా మూడోసారి!



నాని హీరోగా 'జెంటిల్‌మన్', సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' చిత్రాలను ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో నిర్మించిన శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ ముచ్చటగా మూడోసారి నిర్మించే చిత్రానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రియదర్శి రూప కొడువాయూర్ ఇందులో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు మోహనకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నిర్మాత సతీమణి అనిత తొలి క్లాప్ ఇచ్చారు. అనంతరం నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'మా సంస్థకి ఆత్మీయుడు, నాకు అత్యంత సన్నిహితుడు, ప్రతిభాశాలి మోహన్ కృష్ణతో మూడో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బలగం'తో హీరోగా పేరు తెచ్చుకున్న ప్రియదర్శికి ఇది యాప్ట్ సబ్జెక్ట్. తెలుగమ్మాయి రూప హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదో క్యూట్ ఫిల్మ్. స్వీట్ ఎంటర్‌టైన్. చక్కటి వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు ఉంటాయి. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభించాం' అన్నారు. నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఫొటోగ్రఫీ: పి.జి. విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, లిపిక ఆళ్ల, రచన, దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/anC9N16 లో చదవండి.

సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న తాప్సీ





సొట్టబుగ్గల సుందరి తాప్సీ పెళ్లి పీటలెక్కుతోందంటూ కొంత కాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ తాప్సీ తన ప్రియుడు మథియాస్ బో ను రెండు రోజుల క్రితం పెళ్లాడారు. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో పదేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు తాప్సీ. పెద్దలను ఒప్పించి సిక్కు, క్రిష్టియన్ సంప్రదాయాల ప్రకారం వీరిద్దరూ ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులే హాజరయ్యారు. అయితే తన పెళ్లి విషయాన్ని తాప్సీ ఇంతవరకు వెల్లడి చేయలేదు, ఫొటోలు కూడా రిలీజ్ చేయలేదు. కాగా, 2013లో జరిగిన ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో మొదటిసారి వీళ్లిద్దరూ కలుసుకున్నారు. అక్కడి నుంచే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. నటి తాప్సీ ఎప్పటికప్పుడు వారి ప్రేమాయణంపై మీడియా అడిగిన ప్రశ్నలను దాటేసేవారు. తమ ప్రేమ బంధాన్ని ఎంతో గోప్యంగా ఉంచిన తాప్సీ ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో మథియాస్‌తో తన పరిచయం గురించి తొలిసారిగా వెల్లడించారు.

మోత... మోత



విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటున్న విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇందులో విశ్వక్ సేన్ మాస్‌ని మెప్పించే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హోలీ సందర్భంగా 'మోత' పాటను విడుదల చేసి, పండగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది చిత్ర బృందం. అందాల తార ఆయేషా ఖాన్ ఈ ప్రత్యేక పాట కోసం విశ్వక్ సేన్‌తో కలసి చిందులు వేయడం అదనపు ఆకర్షణ. చంద్రబోస్ రాసిన ఈ మాస్ సాంగ్‌ను ఎం.ఎం. మానసి అభిమానుల్లో ఉత్సాహం నింపేలా పాడారు. థియేటర్లలో ఈ పాట మోత మోగించడం ఖాయం అంటున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. మే 17న విడుదలయ్యే ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి , నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య.



బిల్డ్ అమరావతి అంటూ మందడం రైతు ధర్నా శిబిరం నుండి ఆందోళనలు చేస్తున్న రైతులు

అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు

● నియంత పాలన అంతం కావాలి

● 1560వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 25: రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు దోషులేనని 33వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి త్యాగం చేసిన రైతులు అన్నారు. మూడు రాజధానులు వద్దు.. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1560వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిని ఐదేళ్ల నుంచి వైసీపీ పాలకులు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని కాలదన్నటం అతి పెద్ద తప్పిదమన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలనుకోవటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, రాజధాని అమరావతి శాశ్వతమన్నారు. రైతులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలన్నారు. నియంత పోకడలు వద్దని హితవు పలికారు. అమరావతిని హైకోర్టు అభివృద్ధి చేయమని చెప్పినా పాలకులలో చలనం లేదన్నారు. కోర్టు తీర్పులను కూడా పట్టించుకోకపోవటం దురదృష్టకరమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. కాగా ఇప్పుడు ఎన్నికల ఆంక్షలు రావటంతో ధర్నా శిబిరాలలో కాకుండా ఇళ్ల నుండే దీక్షలు, నిరసనలు చేయాలని రాజధాని అమరావతి రైతు జేఏసీ సూచించింది. మూడు రాజధానుల ప్రకటనతో మానసికంగా కుంగిపోయి గుండెపోటు సంభవించి మృతి చెందిన రైతులు, రైతుకూలీలకు సోమవారం రైతు ధర్నా శిబిరాలలో రైతులు, మహిళలు, రైతు కూలీలు నివాళి అర్పించారు.

అభిమానులు, కార్యకర్తలు తలెత్తుకునేలా నిర్ణయం : రావి

● నన్నెందుకు సస్పెండ్ చేశారో నాకు తెలియదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ

పొన్నూరుటౌన్, మార్చి25 : కష్ట కాలంలో తన వెంట నడిచిన అభిమానులు, కార్యకర్తల గౌరవాన్ని పెంచే విధంగా రానున్న ఎన్నికలో పోటీపై నిర్ణయం తీసుకుంటాన్ని వైసీపీ బహిష్కృత నేత రావి వెంకట రమణ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలో పొన్నూరులో వైసీపీని గెలిపించినప్పటికీ కార్యకర్తలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. తాజాగా పొన్నూరు అభ్యర్థిగా కొత్త వ్యక్తిని వైసీపీ ఎంపిక చేసింది, అతను ఎవరో కూడా నాకు తెలియదు అని వ్యాఖ్యానించారు. పోటీపై మాట్లాడుతూ మరో రెండు మూడు రోజులలో కార్యకర్తలతో చర్చించి నిర్ణయించుకోనున్నట్లు చెప్పారు. ఇండిపెండెంట్‌గానా, కాంగ్రెస్ అభ్యర్థిగానా, టీడీపీలోకా, వైసీపీనా అనేది త్వరలోనే చెబుతానన్నారు. 2019 ఎన్నికలో పొన్నూరులో వైసీపీ గెలిచిన తర్వాత తాను ఇక్కడ ఎటువంటి కార్యక్రమాలు జోక్యం చేసుకోలేదన్నారు. పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసిన విషయం టీవీలోనే చూసితెలుసుకున్నానన్నారు. తనకు షోకాజ్ నోటీసులు కానీ, సస్పెన్షన్ ఉత్తర్వులు కానీ అందలేదని తెలిపారు. పార్టీ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో తనకు తెలియటం లేదన్నారు. ఈ సమావేశంలో పలువురు అసంతృప్త వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ మాదిరి పనిచేస్తాం... అభివృద్ధి సాధిస్తాం!

● బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్‌లో.. నారా మాటామంతీ



తాడేపల్లి పైన్‌వుడ్ అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి, మార్చి 25: ఎన్నికల అనంతరం తాను, పెమ్మసాని చంద్రశేఖర్ డబుల్ ఇంజన్ మాదిరి పనిచేసి మంగళగిరి నియోజకవర్గాన్ని చాల వేగవంతంగా అభివృద్ధి చేస్తామని మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తాడేపల్లి పైన్‌ఉడ్ అపార్టుమెంట్‌వాసులతో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమంలో పెమ్మసానితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ రాబోయే ఇరవై ఏళ్లకు అవసరమయ్యే మౌలికసదుపాయాలను కల్పించేందుకు కావల్సిన సమగ్ర ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కృష్ణాజలాలు, రోడ్లు, అండర్‌గ్రౌండు డ్రెయినేజీ, రైతుబజార్లు, శ్మశానవాటికల వంటి అన్ని మౌలికసదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేస్తామన్నారు. తమ విజయంతో మంగళగిరి అభివృద్ధి పరుగులు తీయడం ఖాయమన్నారు. చిన్నతరహా పరిశ్రమలను స్థాపించి యువతకు స్థానికంగానే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో 20వేలమంది పేదలకు పక్కాగృహాలను కట్టించి ఇస్తామన్నారు.

రెండుసార్లు గెలిచిన ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలుపుకుని మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల వరుసగా 25 ఏళ్లపాటు మంగళగిరిని పాలించారు. ఈ 25 ఏళ్లపాటు మంగళగిరిలో ఏమైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. పైగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ఆళ్ల కేసులు వేసి మంగళగిరి అభివృద్ధిని నిరంతరం అడ్డుకున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిలో కృష్ణాజలాల పథకం తాలూకు పనులను ఆరంభిస్తే జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆపనులను నిలిపేశారన్నారు. ఈ రోజుకు మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి నీటి సౌకర్యం కల్పించలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

గత ఎన్నికల్లో తాను ఓటమి చెందినప్పటికీ ఏమాత్రం దిగాలుపడకుండా కసితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వానికి సమాంతరంగా నడిపిస్తూ వచ్చానన్నారు. మొత్తం 29 రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు వివరించారు. ఇందులో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ, ఆరోగ్య సంజీవని, పెళ్లికానుకలు, పేదలు చనిపోయిన సందర్భాలలో వారి మట్టిఖర్చులు, వీవర్స్‌శాల ద్వారా చేనేతలకు ఉపాధి, తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్ల పంపిణీ, కుట్టు శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీ, నైపుణ్య శిక్షణా కార్యక్రమాల వంటివి ఎన్నో వున్నాయన్నారు. ప్రతిపక్షంలో వున్నపుడే ఇన్నేసి ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టామంటే అధికారంలోకి వస్తే మరెన్ని కార్యక్రమాలను చేపడతామో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. మళ్లీ చెబుతున్నా...గత ఎన్నికల్లో ఓటమితో అనేక అవమానాలను ఎదుర్కొన్నా...శాసనసభ సాక్షిగా నా తల్లి, తండ్రిని అవమానించారు. నాతోపాటు మీరందరూ ఈ బాధను గుర్తుపెట్టుకోండి. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోండి. ముఖ్యంగా దానిని సద్వినియోగం చేయండి. 53, 500 ఓట్ల భారీ ఆధిక్యంతో నన్ను గెలిపించండని లోకేశ్ మంగళగిరి ఓటర్లను అభ్యర్థించారు. వైసీపి అధికార బలంతో అవాంతరాలు సృష్టించే అవకాశం ఉంది. అయినా ఓర్పుతో ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకుని తనకు విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ రోజుకు పదిమందికి ఫోన్లు చేసి చైతన్యవంతం చేయాలని లోకేశ్ కోరారు.

జగన్ కంటే సద్దాంహుస్సేన్ చాల బెటర్: పెమ్మసాని

గత అయిదేళ్లుగా రాష్ట్రంలో ఇన్ని దుర్మార్గాలను చేసిన వ్యక్తిని ఇప్పటివరకు తానెప్పుడూ చూడలేదని. నిజానికి జగన్ కన్నా నియంత సద్దాంహుస్సేన్ చాల బెటరేమోనని అనిపిస్తుందని గుంటూరు పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు జగన్ చేసినంత విధ్వంసకర పాలనను మరెవరూ చేయలేదని...ఇక ముందెవరూ కూడ ఇంతటి విధ్వంసం చేయలేరేమోనని ఛలోక్తి విసిరారు. చంద్రబాబు హయాంలో అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు వస్తే జగన్‌రెడ్డి వాటికి కనీసం మౌలిక సదుపాయాలను కూడ కల్పించలేక పోయారన్నారు. అమరావతి కన్వెన్షన్, బీఆర్ఎస్ మెడికల్ అండ్ హెల్త్ సెంటర్, ఇండో-యుకే హెల్త్‌కేర్ సెంటర్, హెచ్‌సీఎల్ వంటి సంస్థలు అమరావతి రాకుండా వాటికి కేటాయించిన భూ కేటాయింపులను రద్దుచేసి జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి రాకుండా అడ్డుకున్నారన్నారు. వీటిల్లో సగం వచ్చినా అమరావతి ప్రాంతం ఎంతోకొంత అభివృద్ధి చెందివుండేదన్నారు. చంద్రబాబుకు ఎక్కడ పేరు వస్తుందోనన్న దుగ్ధతోనే జగన్ వాటన్నింటిని రద్దుచేసి మహాపాపానికి ఒడిగట్టారన్నారు. జగన్ తన కుటిల రాజకీయాల కోసం కులాలను వాడుకుంటున్నారని... ఈ కుటిల కులాల కురుక్షేత్రం నుంచి ప్రజలు బయటకు రావాలని పెమ్మసాని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ పాలనతోనే ముస్లింలకు మేలు

● ఆత్మీయ సమావేశంలో ఎంపీ లావు, యరపతినేని



ఇమామ్, మౌజర్ల ఆత్మీయ సమావేశంలో దువా చేస్తున్న నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల, మార్చి 25: టీడీపీ హయాంలో ముస్లిం మైనారిటీలకు అందించిన దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, విదేశీ విద్య, మసీదుల నిర్మాణం వంటి పథకాలు వైసీపీ పాలనలో పూర్తిగా రద్దు చేయడం జరిగిందని నరసరావుపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ స్థాయి ఇమామ్, మౌజర్, మౌలానాల ఆత్మీయ సమావేశం గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కావాలని 2,500కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయన్నారు. ఏ ఒక్క మసీదుకు, ఈద్గా నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. గురజాల నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు యరపతినేని శ్రీనివాసరావు అండగా ఉంటూ సొంతంగా సుమారు 50 లక్షల వ్యయంతో అతిపెద్ద ఈద్గాను నిర్మించడంతో పాటు ప్రతి ఏడాది హజ్‌యాత్రకు వెళ్లే వారికి అందిస్తున్న సాయం అందిస్తున్న యరపతినేని రుణం తీర్చుకునేందుకు రానున్న ఎన్నికలలో తనకు, యరపతినేనికి ఓటు వేసి గెలిపించాలన్నారు. గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ తన 30 ఏళ్ల రాజకీయ జీవన ప్రయాణంలో ముస్లిం సోదరులు ఎంతో అండగా వున్నారని, వారికి పదవుల కేటాయింపులోనూ తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ముస్లిం సోదరులకు రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దుల్హన్ పథకానికి సవాలక్ష ఆంక్షలు పెట్టడం, రంజాన్ తోఫా రద్దుచేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ హయాంలోనే ఇమామ్, మౌజన్, మౌలానాలకు గౌరవ వేతనం ఇవ్వడం జరిగిందని, వైసీపీ పాలనలో అవేమి ఇవ్వడం లేదన్నారు. లావు, యరపతినేనిలు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ హాజరైన ఇమామ్, మౌలానాలను సత్కరించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన వారు లావు, యరపతినేనిని సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, చింతపల్లి హసన్‌అహ్మద్, నాలుగు మండలాల ఇమామ్, మౌజన్‌లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేట, మార్చి 25: 2024-25 విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో అన్ని సీట్లలో (ప్రతి పాఠశాలలో 80 సీట్లు) 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ 25న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు చిలకలూరిపేట ఏపీఆర్ స్కూల్ ఎఫ్ఎసీ ప్రిన్సిపాల్ ఎన్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ఆ రోజున ప్రవేశపరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వివరాలకు ఫోన్ నెంబర్లు 93910 05515, 93910 05813, 93910 05812 లో సంప్రదించవచ్చని తెలిపారు.

యువత భవితను చిదిమేస్తున్న జగన్ డ్రగ్ మాఫియా: భాష్యం ప్రవీణ్

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యువత భవితను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తోందని కూటమి పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. ఆ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. దేశానికి అన్నపూర్ణగా వున్న రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని ఆయన ఆరోపించారు. ఏపీని మత్తు పదార్థాల రాజధానిగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ ఏది దొరికినా దాని మూలాలు మాత్రం రాష్ట్రంలోనే దొరుకుతున్నాయన్నారు. టీడీపీ హయంలో పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం నెంబర్ వన్‌గా వుంటే జగన్ పాలనలో గంజాయి, డ్రగ్స్ రవాణాలో నెంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు. రాజధానిని విశాఖకు మారుస్తానని చెప్పి తెర చాటున డ్రగ్స్ దిగుమతులు చేసుకుంటూ డ్రగ్స్ క్యాపిటల్‌గా విశాఖను మార్చారన్నారు. డ్రగ్స్ కేసులో వైసీపీ నేతల పాత్ర ఏంటో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీ సీనియర్ నేతలు కన్నా, నరేంద్ర భేటీ

● పరస్పర సహకారంతో గెలుపు కోసం సమాలోచన



సమావేశమైన టీడీపీ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి , సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే, పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సోమవారం గుంటూరులో సమావేశమయ్యారు. గతంలో వీరిద్దరూ వేరువేరు పార్టీల్లో కొనసాగి రాజకీయపరంగా విభిన్న ధృవాలుగా వ్యవహరించేవారు. వారి వారి పార్టీలను సమర్థించుకుంటూ వివిధ రాజకీయ అంశాలపై ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునేవారు. కాంగ్రెస్ వేదికగా కన్నా లక్ష్మీనారాయణ వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించి అనేక మంది ముఖ్యమంత్రుల వద్ద వివిధ శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. కాగా కన్నా నాలుగు పర్యాయాలు పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఐదో పర్యాయం గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తన తండ్రి వీరయ్య చౌదరి వారసత్వంగా ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి అడుగిడి పొన్నూరు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు పర్యాయాలు గెలుపొంది టీడీపీలో సీనియర్ నేతగా వెలుగొందుతున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరూ ఇప్పుడు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. ఇద్దరూ కూడా ఈ పర్యాయం జరిగే ఎన్నికల్లో విజయం సాధించి ఆరో పర్యాయం అసెంబ్లీలో అడుగుపెట్టాలనే ధ్యేయంతో ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. కన్నా టీడీ పీలో చేరిన తరువాత పలు పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరూ కలుసుకొని మాట్లాడుకోవటం జరిగింది. అయితే మొట్టమొదటి సారిగా నరేంద్ర సోమవారం ఉదయం కన్నా నివాసానికి వచ్చి పార్టీపరమైన అంశాలపై చర్చించుకోవటం జరిగింది. కాపు సామాజికవర్గంలో ఎంతో పేరొందిన కన్నా సహకారాన్ని రానున్న ఎన్నికల్లో తన గెలుపు కోసం ఉపయోగపడేలా చేయాలని నరేంద్ర కోరారు. అలాగే టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న నరేంద్ర పరిచయాలను సత్తెనపల్లిలో తనకు సహకరించేలా చేయాలని కన్నా కోరటం జరిగింది. అంతేగాకుండా రానున్న ఎన్నికల్లో జగన్ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి చేయాల్సిన కృషి, ప్రచార అస్త్రాలపై కూడా వారు చర్చించుకున్నారు.

ముగ్గురు వలంటీర్లపై వేటు

రేపల్లె, మార్చి 25: వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. వైసీపీ రేపల్లె అభ్యర్థి ఈవూరి గణేష్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా, ఆ ముగ్గురు వలంటీర్లు ప్రచారంలో పాల్గొని ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరూ ఓటు వెయ్యాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఆ విషయాన్ని ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో కథనం ప్రచురించగా, స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసమూర్తి చర్యలు తీసుకున్నారు. ఆ ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించామని తెలిపారు. రాంబొట్లవారిపాలెం క్లస్టర్ నంబరు 11లో పీ గంగారెడ్డి, కనగాల సచివాలయం పరిధిలోని క్లస్టర్ నంబరు 24, 25లో ఉన్న షేక్ ఫయాజ్ అహ్మద్, కట్టా గోపీలను విధుల నుంచి తొలగించామని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా వలంటీర్లు ప్రచారంలో పాల్గొంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కేశానుపల్లిలో ఒకరు...

దాచేపల్లి, మార్చి 25: మండలంలోని కేశానుపల్లి గ్రామానికి చెందిన రాజవరపు నవీన్ అనే వలంటీర్‌ను విధుల నుండి తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. వలంటీర్‌గా పనిచేస్తున్న నవీన్ తన ఫేస్‌బుక్‌లో జగన్‌కు సంబంధించిన పోస్టులను పెట్టడం అధికారుల దృష్టికి వచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా నవీన్‌ను విధుల నుండి తొలగిస్తున్నట్లు అధికారులు వివరించారు.



బాలికను గర్భవతి చేసిన యువకుడు అరెస్టు

తెనాలి క్రైం, మార్చి 25 : మాయమాటలతో ఓ బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. పెద్దలు పెళ్ళి చేసుకోమంటే గుజరాత్ రాష్ట్రానికి పారిపోయి దాక్కున్నాడు. డీఎస్పీ ఎం.రమేష్‌బాబు తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న బాలికను ఆ పక్క షాపులో పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన యువకుడు ప్రశాంత్ జగదీష్ (21) బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. ఇది గుర్తించిన బాలిక తల్లిదండ్రులు పెళ్ళి చేసుకోవాల్సిందిగా పెద్దల చేత అడిగించారు. దానికి నిరాకరించిన యువకుడు ఇక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై బాధితురాలు జనవరి 29వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన ఆ యువకుడు పోలీసులు వెంటాడుతారన్న భయంతో తన సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్ళకుండా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి గుజరాత్‌లోని భావనగర్‌కు చేరుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అతన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి కోర్టులో హాజరు పరచిన పిదప సోమవారం తెనాలికి తీసుకు వచ్చినట్టు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భట్టిప్రోలు, మార్చి 25: రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన తెనాలి నాగయ్య (47) కొల్లూరు మండలం తోకలవానిపాలెం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఆదివారం రాత్రి గ్రామానికి తిరిగి వస్తుండగా మండలంలోని వెల్లటూరు గ్రామ శివారు వద్ద రాళ్ళ గుట్టలు ఉన్నాయి. రాత్రివేళ ఆ రాళ్లగుట్టలు కనిపించకపోవ ద్విచక్రవాహనం ఆ రాళ్లగుట్టను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య రోడ్డుపైపడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

కోడ్ అమలులో అధికారుల ఉదాసీనత

● సర్పంచ్ ఇంటి గోడపై ఉన్న హోర్డింగ్‌ను వదిలేసిన అధికారులు



గాజుల్లంకలో సర్పంచ్ ఇంటి గోడపై వైసీపీ హోర్డింగ్

కొల్లూరు, మార్చి 25 : ఎన్నికల కోడ్ అమలులో అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చి సుమారు 10 రోజులు కావస్తున్న కొన్ని చోట్ల వైసీపీ నాయకుల ఇళ్లపై ఉన్న జెండాలు, హోర్డింగ్‌లు తొలగించకుండా వదిలేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో గ్రామ సర్పంచ్ సనకా వెంకట్రావు ఇంటి గోడపై వైసీపీ హోర్డింగ్ ఎప్పుడో ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అన్ని చోట్ల ఆయా రాజకీయ పార్టీల బ్యానర్లు, హోర్డింగ్‌లు తదితర వాటిని తొలగించినా సర్పంచ్ ఇంటిగోడపై ఉన్న హోర్డింగ్‌ను మాత్రం అధికారులు చూసి చూడనట్లు వదిలేశారు. సర్పంచ్‌కు ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ రాజకీయ పార్టీల నాయకులు హోర్డింగ్‌ను చూసి ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ అనుమతులు ఉండటంతో హోర్డింగ్ ఉంచారా అంటే అదీ లేదు. దీనిపై జడ్పీ సీఈవో వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడుని కొల్లూరు మండలంలో హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు, ప్రచార వాహనాలకు ఎవరికైనా అనుమతులు ఇచ్చారా అని వివరణ కోరగా హోర్డింగ్‌లు, బ్యానర్లు తదితర వాటికి దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తామని, ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని ఏడు ప్రచార వాహనాలకు మాత్రం అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

కుటుంబం ఆత్మహత్య ఘటనలో

ప్రభుత్వమే సమాధానం చెప్పాలి

● కూటమి సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 25 : కడప జిల్లా కొత్తమాదారం గ్రామంలో ఓ కుటుంబ ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలని కూటమి సత్తెనపల్లి అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కుటుంబానికి చెందిన భూమిని రెవెన్యూ అధికారులు అండతో కాజేయటంతో పాటు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డ కారణం గానే మన స్థాపంతో కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందన్నారు. రాష్ట్రం లో అధికార పార్టీ నేతల అరాచకత్వం ఏస్థాయిలో ఉందన్నదానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను లాగేసుకొనేందుకే జగన్‌రెడ్డి కుట్ర పన్నారని, ఇది చాలా ప్రమాదకరమైనదని, ప్రజలంతా దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను ఓడించకపోతే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. రాష్ట్రం లో వ్యవస్థలను కాపాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కన్నా తెలిపారు.

జగన్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదు

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదని, చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ చేనేత నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ పద్మశాలి సాధికారి సమితి నాయకులు మారెళ్ళ స్వామి, లోకేశ్వరరావు, నన్నం కబ్బయ్య, బాబు, శివరసాల భుజంగరావు, ఏ లక్ష్మణ రావు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు..

విజయపురిసౌత్,మార్చి 25: మాచర్ల మండలం చింతలతండాలోని వైసీపీకి చెందిన 25 గిరిజన కుటుంబాలవారు ఆ పార్టీని వీడి సోమవారం వెల్దుర్తిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మాచర్లలో టీడీపీకి ఓటు వేసి వైసీపీ రౌడీయిజాన్ని తరిమికొట్టాలన్నారు. పార్టీలో చేరిన వారిలో జటావత్ చందునాయక్, మంగ్తానాయక్, రవి, కల్యాణ్, రంజి, రవి, సూర్య, హేమ, హనుమ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, సూర్యనాయక్, ఆడెపు కోటయ్య, సైదారావు, సాంబశివరావు, శ్రీనునాయక్, సీతా అంజి పాల్గొన్నారు.

కారంపూడి : కారంపూడిలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వెల్దుర్తిలోని తన నివాసంలో టీడీపీ మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఉప ఎంపీపీ కర్లా అమర సైదారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలు నాయక్, లొట్ట జాని, బీసీ సెల్ కన్వీనర్ నాగేశ్వరరావు, తెలుగు యువత మండల కన్వీనర్ తుపాకుల చినరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ టీడీపీ, జనసేన నేతలు

బ్రహ్మారెడ్డి గెలుపుతోనే అభివృద్ధి

● 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ' ప్రచారంలో టీడీపీ నేతలు

మాచర్లటౌన్, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపుతోనే మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. పట్టణంలోని ఆజాద్ నగర్‌లో సోమవారం జరిగిన 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ' ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను ప్రజలను వివరించారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, విద్యాధరణి మురళి, షేక్ సుభాని, నాగూర్‌బాషా, మస్తాన్‌వలి, షైనా, గోగుల సీతారెడ్డి, మంజుల అంజి, కోమటి వీరు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో యరపతినేని నిఖిల్ ప్రచారం

పిడుగురాళ్ల, మార్చి 25: పట్టణ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్‌లలో ఆది, సోమవారాలలో గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. 24వ వార్డులోని వాసవి టవర్స్ లక్ష్మీ టవర్స్, ఆక్స్‌ఫర్డ్ ప్రాంతంలోని పలు అపార్ట్‌మెంట్ సముదాయాలలో నిఖిల్, పార్టీ నేతలు కనిగిరి శ్రీను, ఆత్మకూరి కాశీవిశ్వనాథం, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివ రావు, సేగు రమేష్, పలుచూరి ధనుంజయ, ఎస్ఆర్ఎంటి సుబ్బారావు, వీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వలలతో చేపల వేట

● ఇద్దరిపై కేసు.. ఎస్ఐ అమీనుద్దీన్ వెల్లడి

మాచవరం, మార్చి 25: కృష్ణానదిలో నిషేదిత వలలతో చేపలు పడుతున్న ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ సోమవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. మత్స్య శాఖ అధికారులు వెల్లంపల్లి గ్రామానికి చెందిన గొర్రె శ్రీనివాసరావు, చెన్నాయపాలెం గ్రామానికి చెందిన మేఘావత్ లక్ష్మానాయక్ అనే ఇద్దరు వ్యక్తులు నిషేదిత వలలతో చేపలు పడుతున్నారంటూ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్థానిక రఘురామ్‌నగర్‌లో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయం వద్ద పట్టణ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్టీ సెల్ నేతలు కన్నాను కలసి స్వీట్లు అందించి హోలీ శుభాకాంక్షలు తెలిపారు **- సత్తెనపల్లి.**

చంద్రబాబును సీఎం చేయడమే ధ్యేయం

● ఇదే లక్ష్యంతో టీడీపీ శ్రేణులు పనిచేయాలి

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు



ఇరికేపల్లిలో తువ్వా శ్రీనివారావుతో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

దాచేపల్లి, మార్చి 25: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్క టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్త పనిచేయాలని నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం దాచేపల్లి నగర పంచాయతీలోని ఇరికేపల్లిలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు తవ్వా శ్రీనివాసరావు స్వగృహంలో లావు శ్రీకృష్ణదేవరాయలు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా పనిచేసి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని బలపరిచే విధంగా పనిచేయాలన్నారు. ఎంపీగా నన్ను, ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావును మంచి మెజారిటీతో గెలిపించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ నారాయణ, బుల్లెబ్బాయి, జాస్తి శంకర్, జంగా కోటిరెడ్డి, చిలుముల దుర్గారావు, భవనం వీరారెడ్డి, నాగెండ్ల మోషె, జంగా రామిరెడ్డి, గోళ్ల నాగయ్య, తదితరులున్నారు.

గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి లావు పర్యటన

పిడుగురాళ్ల: నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం జూలకల్లు, పందిటివారిపాలెం, జానపాడు గ్రామాలలో పర్యటించారు. జూలకల్లులో విద్యుదాఘాతంతో దగ్ధమైన గృహాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం పాతపాటేశ్వరమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. పందిటి వారి పాలెం గ్రామంలో పుల్లారెడ్డి, బైలడుగు పిచ్చయ్య కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడిన రోకటి కోటయ్యను పరామర్శించారు. జానపాడు గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు, ముఖ్యులతో ఎంపీ లావు ఆత్మీయ సమావేశం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమాల్లో వున్నం నరసింహారావు, డాక్టర్ నాగమల్లికార్జున రావు, గండికోట వెంకటేశ్వర్లు, కొండా, వున్నం శ్రీను, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, నర్రా సాంబశివరావు, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, దామరచర్ల హనుమంతరావు, యర్నాన రామకృష్ణ, పసుపులేటి నరసింహారావు, తోట రామదాసు, ఆకుల సుబ్బారావు, ముజావర్ సైదా, తాళ్లపోగు రత్నం, పాలకేంద్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు నుంచే ఎన్నికల శంఖారావం

● కూటమి సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, మార్చి 25 : నకరికల్లు నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం నకరికల్లులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతుశౌరయ్యతో కలసి టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కన్నా మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు అందరం కలసి కట్టుగా పనిచేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అరాచక పాలనను తుద ముట్టించటానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కలసి ఒకే లక్ష్యంతో పని చేయాలన్నారు. సీఎంజగన్ రాష్ట్రంపై మోయలేని అప్పుల భారాన్ని మోపారన్నారు. వైసీపీని గద్దె దింపేందుకు ప్రజలంతా సంసిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, టీడీపీ పరిశీలకులు ముక్కపాటి రామచంద్రరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చింతపల్లి షేక్ ఫకీర్ అహమ్మద్, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు దూదేకుల హసీనాబీ, తిరుమలశెట్టి వెంకట్రావ్ పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న లావు, యరపతినేని

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

● పాల్గొన్న ఎంపీ , మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి25: కరాలపాడు గ్రామంలోని కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



టీడీపీలో చేరిన గురజాల ఎస్సీ కాలనీ వాసులు

యరపతినేని సమక్షంలో టీడీపీలోకి..

ఎస్సీ కాలనీకి చెందిన పలువురు కరాలపాడులో టీడీపీలో చేరడం జరిగింది. అందుగుల చిన్న, ప్రసాద్, గోపి, నాగభూషణం, బొల్లెద్దుల తిమోతి, కోటయ్య, యాదాల రాజు, దర్శి నరసయ్య, కాశిమళ్ల శివ, పోతుల సాగర్, కాశిమళ్ల నాగరాజుతో పాటు పలువురికి లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, గండికోట వెంకటేశ్వర్లు, సంకుల వెంకటేశ్వర్లు, మంగిరెడ్డి, యలమందారెడ్డి, కొత్త గోపాల్, జానీ, బాజీ, పాదర్తి రాజేశ్వరి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్‌తో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

గురజాల పట్టణ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 40 కుటుంబాలకు చెందిన వారు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పిడుగురాళ్ల పట్టణ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి చేరిన వారిలో కొండా శివకోటేశ్వ రరావు, శివ, చెన్నయ్య, వెంకటేష్, జోషఫ్, రాజేష్, రామయ్య తదితరులు ఉన్నారు.

తిరునాళ్ల ఆదాయం రూ. 29,56,808

దుర్గి, మార్చి 25: మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజులపాటు తిరునాళ్లకి విచ్చేసిన భక్తులు వివిధ రూపేణా రూ.29,56,808 సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మ బాయి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి, ఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మాచవరం, మార్చి 25: పిల్లుట్ల శివారు సింగరాయపాలెంతండా కొండపై వేంచేసియున్న సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. పుణ్యదంపతులు పీటలపైకూర్చొని స్వామి కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రెంటచింతల,మార్చి 25: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పాతపాలువాయి గ్రామంలో సోమవారం జరిగింది. రెంట చింతల ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాత పాలువాయి గ్రామానికి చెందిన గుంటా మణికంఠారెడ్డి తన తల్లి సంవత్సరీక కార్యక్రమం నిమిత్తం బంధువులను ఇంటికి ఆహ్వానించాడు. నీళ్లు పట్టేందుకు స్విచ్ ఆన్ చేసేందుకు సమీపంలోని సత్రం వద్ద వున్న బోర్‌మోటార్ వద్దకు వెళ్లాడు. ఆక్రమంలో తడి చేతులతో స్విచ్‌వేయగా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మణికంఠారెడ్డికి భార్య రోజా, ఐదేళ్ల బాలుడు ఉన్నారు. మృతుడి భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందినవారికి సత్కారం

నకరికల్లు, మార్చి 25 : కుంకలగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడు-2గా విధులు నిర్వహిస్తున్న పీ.మాధవిలతకు, నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సింగరాజు రామకృష్ణసాయికి బయోకెమిస్ట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు సోమవావరం వారిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కండ్లకుంట మురళీకృష్ణ, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ పూజాశ్రీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. అలాగే బదిలీపై వెళ్ళిన యూడీసీ శ్రీనివాస రావును సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

మాచర్ల రూరల్, మార్చి 25: పట్టణంలోని 31వ వార్డులో టీడీపీకి చెందిన 50 ఎస్సీ కుటుంబాలు ఆదివారం రాత్రి ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసన సభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

టీడీపీ నేతల ప్రచారం

పెదకూరపాడు,మార్చి 25: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రూపొందించిన మేనిఫెస్టోపై సోమవారం పెదకూరపాడులో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ మిలటరీ మౌలాలి, టీడీపీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ దిలీప్ స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాంబాబు మోసం చేశాడు

సత్తెనపల్లి మార్చి 25: మంత్రి అంబటి రాంబాబు వైసీపి నేతలు తనను మోసం చేశారని సీనియర్ తాపీ మేస్త్రీ, వైసీపీ కార్యకర్త బద్దుల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి వైసీపీ కార్యాలయం నిర్మాణానికి సంబంధించి తనకు రూ. 7 లక్షలు ఖర్చు అయితే రూ. 4 లక్షలు ఇచ్చి, మిగిలిన రూ.3 లక్షలు ఇవ్వలేదని అన్నారు. వైసీపీ కార్యాలయం నిర్మాణానికి పనిచేసిన కూలీలు డబ్బులు అడుగుతున్నందుకు తన ఇంటికివచ్చి గొడవ పెట్టుకుంటున్నారని వాపోయారు. వైసీపీ పెద్దలు జోక్యం చేసుకుని తనకు రావలసిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని నాగేశ్వరరావు కోరారు.

పేదలపై దాడులు పెరిగాయి

ముప్పాళ్ళ మార్చి 25: వైసీపీ పాలనలో పేదలైన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని టీడీపీ నేత మదిర రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ముప్పాళ్ళలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు ఎంతో మేలు జరిగిందన్నారు. విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అరాచకాలకు, అక్రమాలకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రం బాగు పడాలన్నా, అన్నివర్గాలకు మేలు జరగాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వినతి పత్రం అందజేత

సత్తెనపల్లి, మార్చి 25 : సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో నెలకొన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సోమవారం డిపో మేనేజర్ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పలువురు పాల్గొన్నారు.

ఇండియా వేదికను బల పరచాలి

సత్తెనపల్లి, మార్చి 25 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్న ఇండియా వేదికను ప్రతి ఒక్కరు బల పరచాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం సాయంత్రం సీపీఎం పట్టణకమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న విజయకుమార్ మాట్లాడుతూ ఇండియా వేదిక ఇచ్చిన హామీలను సీపీఎం కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో గద్దె ఉమశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

దుర్గి, మార్చి 25: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసియున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కొలువై వున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వడ్లమాను గోపాలచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వహణాధికారి గుర్రం శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కటకం కోటయ్య, కపలవాయి వెంకటప్పయ్య పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారిని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

గుంటూరు బాపనయ్యకు నివాళులు

క్రోసూరు, మార్చి 25 : ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి భూమి, తిండి దక్కాలని జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ.రవిబాబు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుంటూరు బాపనయ్య 46వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం క్రోసూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపనయ్య చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, గంటెల చిన్నప్ప, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులోని ఓ హోటల్‌లో అట్టు వేస్తున్న భాష్యం ప్రవీణ్

సైకిల్ గుర్తుకి ఓటేయండి..

● కూటమి పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

● వివిధ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం..

పెదకూరపాడు, మార్చి 25 : త్వరలో జరుగనున్న ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రజలను కోరారు. సోమవారం ఆయన మండలంలోని చినమక్కెన, లగడపాడు, పెదకూరపాడు, గారపాడు, హుస్సేన్‌నగరం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదకూరపాడులో హోటల్లోకి వెళ్లి అట్టు వేశారు. ఆర్టీసీ బస్సు ఎక్కి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రయాణికులను కోరారు. రోడ్డువెంబడి చిరు వ్యాపారులను ఆప్యాయంగా పలుకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, ఉగ్రంకి ధర్మారావు, షేక్ ముంతాజ్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు ..

వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షులు జోజి ఆధ్వర్యంలో మండలంలోని లగడపాడులో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

క్రోసూరు : భాష్యం ప్రవీణ్ సమక్షంలో క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన 13 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారి మెడలో పార్టీ కండువాలు వేసి ఆయన సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మొగల్ జాన్, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి, టీడీపీ నాయకులు దుద్దుల యోహాన్, నలజాల కోటేశ్వరరావు, ఏపూరి నాగేశ్వరరావు, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.



చెరుకుంపాలెంలోని హనుమాన్ గుడిలో పూజలు చేస్తున్న భాష్యం ప్రవీణ్

చెరుకుంపాలెంలో భాష్యం ప్రవీణ్ ప్రచారం ..

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో సోమవారం భాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా చెరుకుంపాలెంలోని హనుమంతుని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి ర్యాలీగా తిరుగుతూ కాలనీల్లో ప్రచారం చేశారు. బీజేపీ, జనసేన కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పార్టీ నాయకుడు పోట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పోట్ల శ్రీనివాసరావు, మొక్కపాటి గిరిబాబు, మన్నెం భద్రయ్య, బాష్యం ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా అచ్చంపేటలో సాయిబాబా ఆలయం వద్ద నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

నియోజకవర్గంలో అవినీతి, అరాచకత్వమే ..

● విలేకరుల సమావేశంలో భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 25 : పెదకూరపాడు నియోజక వర్గంలో ఎక్కడ చూసినా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అవినీతి, అరాచకత్వమే కనిపిస్తుందని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. పెదకూరపాడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ నాయకుల పై అక్రమ కేసులను పెడుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని, ఓటమి భయంతోనే టీడీపీ నేతల పై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శంకరరావుకి కంచేటి సాయి అరెస్టుకు ప్రభుత్వానికి ఏమి సంబంధం లేదని, ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆ కేసు జరిగిందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు వాస్తవాలు తెలుసుకోకుండా మా పార్టీ నేతలు, కార్యకర్తలను అక్రమంగా కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, అక్రమంగా కేసులు పెట్టిన పోలీసువారిపై కూడా విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవటానికి వెనుకాడబోమని ప్రవీణ్ హెచ్చరించారు.



గుంటుపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నా నాగరాజు, నాయీ బ్రాహ్మణ నేతలు

గుంటుపల్లి సేవలు మరువ లేనివి : కన్నా

సత్తెనపల్లి మార్చి 25: టీడీపి జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యుడు, నాయిబ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు అందించిన సేవలు మరువ లేనివని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ ఆధ్వర్యంలో గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కార్యక్రమంలో పత్తిపాటి హరేకృష్ణ, పిల్లుట్ల సుబ్బారావు, కొమ్మూరి వెంకటరావు, మున్నంగి శివయ్య, పత్తిపాటి పరమేశ్వరరావు, కోటేశ్వరరావు, సాంబశివరావు, రామకృష్ణ, కొటమర్రి బ్రహ్మం, జిలాని, రామకృష్ణ, యెలినేడి లక్ష్మీతులసి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

6వ వార్డులో కన్నా నాగరాజు ప్రచారం..

సత్తెనపల్లి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రాత్రి పట్టణంలోని 6వ వార్డులో గుంటూరు మాజీ మేయర్, టీడీపీ నేత కన్నా నాగరాజు ప్రచారం చేశారు. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి రానున్న ఎన్నికల్లో కన్నా లక్ష్మీనారాయణను, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. ప్రచారంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కూటమి గెలుపే ఎంఆర్‌పీఎస్ లక్ష్యం

సత్తెనపల్లి మార్చి 25: రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టుపార్టీ కృషి చేస్తుందని నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయులు గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కనుమూరి కోటేశ్వరరావు, అశోక్‌బాబు, జీ.అశోక్, కే.బాబురావు, మునలయ్య, నాగేశ్వరావు, ఆనందరావు, శ్యాంసన్, షాలెంరాజు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలి వేడుకలు

విజయపురిసౌత్, మార్చి 25: స్థానిక సేవాలాల్ మహరాజ్ ఆలయంలో సోమవారం హోలి వేడుకలను ధర్మకర్త కేతావత్ పాండునాయక్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. గిరిజనులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ హోలి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడావత్ బాలాజీనాయక్, సర్పంచ్ శ్రీనునాయక్, మూడావత్ మంగ్తానాయక్, మంగ్తానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు

50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

బొల్లాపల్లి, మార్చి 25: మండలంలోని పేరూరుపాడులో వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరారు. మొత్తం 50కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పేరూరుపాడు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, ధూపాటి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, బత్తుల గోవిందరాజులు, విజయ్‌బాబు, ఎలిశెట్టి నరసింహారావు, బొడ్డపాటి మల్లిఖార్జున, కాట్రగడ్డ గోవిందరాజులు, గుర్రం నరసింహారావు, గంగినేని రమణయ్య, మేకల యలమంద, బీజేపీ నాయకులు నలబోలు విష్ణు తదితరులు పాల్గొన్నారు.


పనసతోటలో పర్యటిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు

పనసతోటలో బాబు ష్యూరిటీపై ప్రచారం

నరసరావుపేట టౌన్, మార్చి 25: నరసరావుపేట పట్టణంలోని బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటించారు. పట్టణంలోని మూడవ వార్డు పనసతోటలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పనసతోటలో డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు మహిళలు హారతులతో ఘనస్వాగతం పలికారు, కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు బొల్లు వెంకటకృష్ణ, ట్రస్ట్ సభ్యులు

పేద విద్యార్థికి బొల్లు చారిటబుల్ ట్రస్టు సాయం

నరసరావుపేట టౌన్, మార్చి 25: నరసరావుపేట పట్టణంలోని బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ పేద విద్యార్థికి ఎన్‌జీవో కాలనీలోని కార్యాలయంలో సోమవారం ఆర్థికసాయం అందజేసింది. చిలకలూరిపేట మండలం ఎడవల్లికి చెందిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న బొల్లు తారకనాథ్‌కు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, సభ్యులు మర్లపాటి రామకృష్ణ, బీవీఎల్ వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్యారమ్స్ పోటీలకు ఏఎంజీ విద్యార్థులు


డొక్కా బాల రాజు, సన్ని డయాల్

చిలకలూరిపేట, మార్చి 25: జాతీయ క్యారమ్స్ పోటీలకు స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో డొక్కా బాల రాజు, చాట్ల సన్ని డయాల్ ఉన్నారు. వీరిద్దరు ఈ నెల 28 నుంచి 31 వరకు వారణాసిలో జరిగే జాతీయ సబ్ జూనియర్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో వారు పాల్గొని మంచి క్రీడా ప్రతిభ కనబరిచారు. దీంతో పోటీలకు వారి ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఈ విద్యార్థులను ఏఎంసీ సంస్థ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి, స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్, స్టేట్ సెలక్షన్ కమిటీ చైర్మన్ పాలమణి శ్రీనివాసరావు, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకేవీ ప్రసాదు, హైస్కూల్ హెచ్ఎం కృపాదానం, పీఈటీలు రాజు, రాజేష్ తదితరులు అభినందించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుకలు


ప్రత్యేక అలంకరణలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 25: వార్షిక సప్తాహాలలో భాగంగా మండలంలోని వేల్పూరులోని వీరబ్రహ్మేంద్ర విజ్ఞాన సేవాశ్రమంలో ఆశ్రమ చైర్మన్, న్యాయవాది యలవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరబ్రహేంద్ర స్వామి, గోవిందమాంబల కల్యాణ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి బ్రహ్మదాసు నాయన భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అలంకరణచేసి భక్తిశ్రద్ధలతో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు పూసపాటి నాగేశ్వరరావు, వీరభద్రాచారి స్వామివారి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేడుకలకు అందంగా ముస్తాబు చేసి మేళతాళాలతో అంగరంగ వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. దేసు మల్లికార్జురావు, సత్యనారాయణ, కెల్ల బ్రహ్మం, తన్నీరు ఏడుకొండలు, వేల్పూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో సంయమనంగా వ్యవహరించాలి

● వినుకొండ రూరల్ సీఐ సుధీర్‌బాబు


అన్నవరంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

నూజెండ్ల, మార్చి 25: గ్రామాల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు సంయమనంగా వ్యవహరించి వాగ్వాదాలు, ఘర్షణలకు దిగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా చూడాలని వినుకొండ రూరల్ సీఐ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని గుర్రప్పనాయుడుపాలెం, టీ అన్నవరం గ్రామాల్లో సోమవారం కేంద్ర బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, ఐనవోలు పోలీసు సిబ్బంది ఉన్నారు.

కాలువలు.. కనుమరుగు

- ఆక్రమణలకు గురవుతున్న ఎన్ఎస్‌పీ మేజర్ కాలువలు
- మైనర్లపైనా పర్యవేక్షణ కరువు
- కాలువల అభివృద్ధికి నిధులు కేటాయించని ప్రభుత్వం
- పట్టించుకోని అధికారులు


కాలువ రూపమే కోల్పోయిన చీకటీగలపాలెం మేజర్

వినుకొండ టౌన్, మార్చి 25: ఎన్ఎస్‌పీ అధికారుల నిర్లక్ష్యానికి మేజర్‌కాలువపై నిర్మించిన మైనర్లు కనుమరుగవుతున్నాయి. సిబ్బంది కొరతతో మేజర్లను అధికారులు పట్టించుకోకపోవటంతో కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. వినుకొండ నియోజకవర్గంలో ఇనిమెళ్ల, అంగలూరు, పెరుమాళ్లపల్లి, ఐనవోలు, చింతలచెరువు, ముక్కెళ్లపాడు, త్రిపురాపురం, నూజెండ్ల, జమ్మలమడుగు, వేముల మేజర్, పేరూరుపాడు, దొండపాడు, సీహెచ్.పాలెం, పలుకూరు వంటి 14 మేజర్ కాలువల నుంచి 857 క్యూసెక్కుల నీరు మైనర్ కాలువల సాయంతో పంట భూములకు నీరు చేరాల్సి ఉంది. గతంలో వినుకొండలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది కాలువల పర్యవేక్షణ కొరవడంతో మైనర్లు కనుమరుగయ్యాయి. దీంతో చివరి భూములకు నీరందే పరిస్థితి లేకపోవడంతో వాణిజ్యపంటలు సాగు చేస్తున్న రైతులు మేజర్ కాలువలపై నీళ్ల ఇంజన్ల సాయంతో పంటలు సాగు చేస్తున్నారు. మైనర్ కాలువలపై శ్రద్ధచూపని అధికారులు కనీసం వాటి అభివృద్ధికి తట్టమట్టి పోసిన దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాగార్జునసాగర్ కెనాల్‌పై ఉన్న కాలువలకు నిధులు విడుదల చేయకపోగా మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు ఖరీఫ్ మొదలుకొని రబీ వరకు కాలువ నీటి కోసం పలు అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రధానంగా వినుకొండ పెరుమాళ్లపల్లి మేజర్‌కాలువ నుంచి వెంకుపాలెం ప్రధాన రహదారి వైపు ఉన్న మైనర్ ఇప్పటికే కనుమరుగైంది. ఇదిలా ఉండగా చీకటీగలపాలెం మేజర్‌కాలువ గత కొంతకాలం నుంచి అన్యాక్రాంతమైనప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.



పెరుమాళ్లపల్లి మేజర్‌పై నిర్మించిన వితంరాజుపల్లి మైనర్ కాలువ స్థలంలో రియల్టర్లు నిర్మించిన రోడ్డు మార్గం , మేజర్‌కాలువపై రియల్టర్లు నిర్మించిన ప్రహరీ

చేసిన అభివృద్ధే తెలుగుదేశం ప్రచారమంత్రం

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 25: ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్ల హయాంలో చేసిన అభివృద్ధే తమ ప్రచార మంత్రమని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సూపర్-6 పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీచేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం కుటుంబ సాధికార సారథులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ పది సంవత్సరాల ప్రయాణంలో తమకు అవకాశం లభించిన ఐదు సంవత్సరాల్లో టీడీపీ ఏం చేసిందో, తరువాత వైసీపీ ఏం చేసిందో ప్రజలు గమనించాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజ్‌లు, పక్కా గృహాల నిర్మాణం నుంచి ప్రాజెక్టులు, ఉపాధి కల్పనలో 2014 నుంచి 2019 వరకు ఏపీ దేశంలోనే నెంబరు-1గా ఉన్నదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తరువాత వైసీపీ ఐదు సంవత్సరాల హయాంలో దానికి పూర్తిగా భిన్నమైన రీతిలో పాలన సాగిందన్నారు. టీడీపీ హయాంలో దాదాపు టిడ్కో ఇళ్ల పంపిణీ కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఇలాంటి ప్రభుత్వం మనకు అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారని, టీడీపీ గెలుపుతో ఆగిపోయిన అభివృద్ధి ముందుకు సాగుతుందని, సంక్షేమానికి భరోసా లభిస్తుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే సూపర్-6 హామీలతో చంద్రబాబు ప్రణాళికలు రచించారన్నారు. వాటి అమలుతో ప్రజల జీవన ముఖచిత్రాలే మారనున్నాయని ఆయన అన్నారు. ఇక్కడ తాను చేసిన అభివృద్ధిని చూసి టీడీపీకి ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు సకల మానవాళికి అనుసరణీయం

నరసరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ


శిలువ మార్గం పాదయాత్రలో శిలువను మోస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 25: యేసుక్రీస్తు బోధనలు సకల మానవాళికి అనుసరణీయమని నరసరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం కనపర్తి బాలయేసు గుడి దాకా క్రైస్తవ సోదరులు శిలువ మార్గం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయ, క్షమాగుణం, త్యాగం, సహనం యేసు క్రీస్తు బోధనలువీటిని ప్రజలంతా పాటిస్తే సమాజంలో అశాంతి, అల్లర్లకు తావుండదన్నారు. నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించు అన్న క్రీస్తు మాటను ప్రజలంతా పాటించాలన్నారు. ప్రతిఏటా క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. క్రీస్తుప్రేమ, ఆశీర్వాదాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫ్రాన్సిస్, కన్యదార రాజు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ పండుగ సంబరాలు


సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన, పలువురు సుగాలీలు

వినుకొండ, మార్చి 25: పట్టణంలోని పురవీధుల్లో హోలీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పెద్దసంఖ్యలో రోడ్ల మీదకు వచ్చి హోలీని జరుపుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో భాగంగా మాజీఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కార్యాలయంలో హోలీ పండుగను పురస్కరించుకొని సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి మండలంలోని సుగాలీవాసులతోపాటు పలువురు ఆయనను కలిసి మిఠాయిలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ హోలిని ప్రతి సంవత్సరం ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషకరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో టీడీపీ, జనసేన, బీజేపీ బలపర్చిన అభ్యర్థులను అఖండమైన మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనునాయక్, మాజీ సర్పంచ్‌లు గాలి నాగేశ్వరరావు, పసుపులేటి నరసింహారావు, మాజీ వైస్ ఎంపీపీ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, చిన్నానాయక్, విష్ణునాయక్, మస్తాన్‌నాయక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


వెల్లటూరులో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, మార్చి 25: మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, పేరూరుపాడు, గండి గనుమల తదితర గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా చిన్నారులు, పెద్దలు గులాంలతో రంగులు పులుముకొని హోలీ వేడుకలు నిర్వహించారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, మార్చి 25: మండలంలోని గ్రామాల్లో హోలీ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. చాకలికుంట తండా గ్రామంలో పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

కోలాహలంగా కోటప్పకొండ గిరిప్రదక్షిణ


కోటప్పకొండ చుట్టు గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, మహిళలు

నరసరావుపేట టౌన్, మార్చి 25: ప్రముఖ శైవక్షేత్రం కోప్పకొండ గిరిప్రదక్షిణ కార్యక్రమం సోమవారం కోలాహలంగా జరిగింది. పౌర్ణమి కావడంతో తెల్లవారు జామునుంచి భక్తుకుల సోపానమార్గం, సాయిబాబు గుడి వద్ద నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. హోలీ పండుగ సెలవు కావడంతో అధికసంఖ్యలో భక్తులు కోటప్పకొండకు తరలివచ్చారు. గిరిప్రదక్షిణ అనంతరం త్రికోటేశ్వరుని దర్శించుకున్నారు. చిన్మాయారణ్య ఆశ్రమం వద్ద భక్తులకు మజ్జిగ ఆశ్రమ ప్రతినిధులు రామకృష్ణ, లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. కాగా భక్తులకు గిరిప్రదక్షిణ మార్గం మధ్య అనుమోలు వెంకయ్యచౌదరి తాగునీరు ఏర్పాటుచేశారు. అదేవిధంగా సాయిబాబా ఆలయం వద్ద భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

రైల్వే బ్రిడ్జి వద్ద అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, మార్చి 25: నకరికల్లు మండలం కుంకలగుంటలోని రైల్వే బ్రిడ్జి వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. సోమవారం నిర్వహించిన తనిఖీలలో పది సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నటు ఆమె తెలిపారు. మద్యం సీసాలను తరలిస్తున్న నిందితుడు కుంకలగుంట గ్రామానికి చెందిన వైరవిప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు.


టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీలో మిగిలేది జగన్ ఆయన అభ్యర్థులే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 25: ఎన్నికల నాటికి వైసీపీలో మిగిలేది జగన్, తన అభ్యర్థులు మాత్రమేనని, ఓటు వేయటానికి, వేయించటానికి కార్యకర్తలు, నాయకులు ఎవ్వరూ మిగలరని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. టీడీపీలోకి నిరంతరాయంగా కొనసాగుతున్న వలసలే ఇందుకు నిదర్శనమన్నారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామం నుంచి టీడీపీలో భారీగా వలసలు సాగుతున్నాయి. ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చేందుకు సముఖంగా ఉన్న మాజీ సర్పంచ్ వలేటి హిమంతరావు వర్గీయులు, విశ్రాంత ఉపాధ్యాయుడు కెల్లంపల్లి అచ్చయ్య, జంపని బ్రదర్స్ వీరి వర్గాలతో సిద్ధమవ్వగా మొదటి వార్డు అంబేద్కర్ కాలనీ నుంచి జంపని బ్రదర్స్ ఆధ్వర్యంలో పెనుముల రుద్రయ్య, బాబు, పీ రామసుబ్బారావు, వంగలపూడి శ్యామ్ బాబు, పెనుముల పౌలు, తాళ్ళూరి దాసులతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో సోమవారం టీడీపీలో చేరారు. వీరికి ప్రత్తిపాటి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ముఖ్యంగా దళితులను వేధించటంలో ముందుందన్నారు. ఒక దళితుడిని చంపి డోర్ డెలివరీ చేయటం, ఓ వైద్యుడిని వేధించి చంపటం, మహిళలకు రక్షణ లేకుండాచేయటం, వేలకోట్ల రూపాయల డ్రగ్స్ మాఫియా నడపటం వంటివి వైసీపీ అరాచక పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలోకి వచ్చే వారందరినీ కలుపుకొని మంచి మెజార్టీ కోసం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జంపని వెంకటేశ్వరరావు, షేక్ హుస్సేన్, వలేటి సురేష్, రావిపాటి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామి దేవాలయానికి భూమి పూజ

నాదెండ్ల, మార్చి 25: మండలంలోని గణపవరంలో అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి మునిసిపల్ వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి కెల్లంపల్లి అప్పయ్య, ఆయన ధర్మపత్ని హనుమాయమ్మ కుమారుడు బద్రి నారాయణచౌదరి జ్ఞాపకార్థం మనుమడు వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు సుమారు కోటి రూపాయలు విలువ చేసే 20సెంట్ల భూమిని విరాళంగా అందజేశారు. దేవాలయాన్ని రెండు కోట్ల రూపాయల వ్యయంతో గణపవరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సేవా సంఘం సభ్యులు చెపుతున్నారు.


గణపవరం రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అధ్వానంగా గణపవరం రహదారి

నాదెండ్ల, మార్చి 25: చిలకలూరిపేట పట్టణం నుంచి గణపవరం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. చిలకలూరిపేట పట్టణంలోని మురుగునీరు అంతా ఈ రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియనగర్ ప్రాంత పరిధిలో ఈ రోడ్డు సుమారు అరకిలోమీటరు దూరం నీరు ప్రవహించటంతో రహదారి గుంతలమయంగా మారింది. గణపవరం నుంచి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలపై ఈ రహదారి మీదుగా చిలకలూరిపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. మురుగునీరు ఈ విధంగా ప్రవహించటంతో ఎదురవుతున్న ఇబ్బందులను మునిసిపల్ అధికారులు నీటి ప్రవాహాన్ని మళ్లించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


రాజకుమారికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

కందిమళ్ళ రాజకుమారికి ఘన నివాళి

చిలకలూరిపేట, మార్చి 25: చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన కందిమళ్ళ రాజకుమారికి సోమవారం మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో జరిగిన ఆమె పెద్ద కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాజకుమారి భర్త మండల టీడీపీ నేత కందిమళ్ళ హనుమంతరావు, ఆమె కుమారుడు డాక్టర్ కందిమళ్ళ వాసుదేవ్, టీడీపీ నేతలు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదనమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం

చిలకలూరిపేట, మార్చి 25: స్థానిక జన విజ్ఞాన వేదిక లాలుదాదసాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పండరీపురంలోని ప్రిలియంట్ స్కూల్‌లో సోమవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు షేక్ సిద్ధాంతి కరిముల్లా మాట్లాడుతూ తాగునీటిని సంరక్షించుకోవటం అందరి బాధ్యత అన్నారు. రక్షిత నీటిని నిల్వ చేయటం కోసం ఎవరికి వారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రచురించిన నీటి సంరక్షణ అనే పుస్తకాలను 50మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. తాగునీటి సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చేవూరి కృష్ణమూర్తి, పాఠశాల డైరెక్టర్ మద్దిరాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయం కోసం ఐక్యంగా పనిచేయాలి

● చిలకలూరిపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కావటి

నాదెండ్ల, మార్చి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కలసికట్టుగా పనిచేయాలని చిలకలూరిపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. గొరిజవోలు గ్రామంలోని మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి గృహంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల ప్రకారమే తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానన్నారు. కార్యకర్తల మధ్య విభేదాలు ఉంటే వాటిని పరిష్కరించుకొని గెలుపుకోసం కృషి చేద్దామని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కే వెంకటరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గృహలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేట బీఎస్పీ అభ్యర్థిగా నల్లపు కోటేశ్వరరావు

చిలకలూరిపేట, మార్చి 25: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజక వర్గ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా స్థానిక న్యాయవాది నల్లపు కోటేశ్వరరావును పేరు ప్రకటించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం అధికారికంగా పేరు ప్రకటించింది.